## క్లుప్తంగా

### నూతన నియామకం


మౌనిక

యాచారం: మండల పరిధి మంతన్‌గౌరెల్లి గ్రామానికి చెందిన సభావట్ మౌనిక అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం( ఐద్వా) జిల్లా కమిటీ సభ్యురాలిగా నియమితులయ్యారు. నగర శివారు మీర్‌పేటలో జరుగుతున్న ఐద్వా జిల్లా నాలుగో మహాసభలో బుధవారం మౌనికను నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని చెప్పారు.

### నాగన్నకు అవార్డు అభినందనీయం

మాడ్గుల: ప్రజాకవి, విప్లవ గాయకుడు అరుణోదయ నాగన్నకు ప్రజాకవి సుద్దాల హన్మంతు జానకమ్మ జాతీయ పురస్కారాన్ని ఈ నెల 19న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రదానం చేయనున్నట్లు ప్రజా కళాకారుడు, గాయకుడు జి. రమేష్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సినీగేయ రచయిత సుద్దాల అశోక్ ఈ విషయాన్ని ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఏటా ఈ ఫౌండేషన్ కళాకారులకు అవార్డులను అందజేస్తుందని పేర్కొన్నారు. తన ఆటపాటలతో ప్రజాసమస్యలపై పోరాడిన గొప్ప కళాకారుడు నాగన్న.. జైలు జీవితం గడిపారని గుర్తుచేశారు. ప్రత్యేక తెలంగాణ పోరాటంలో తనదైన ముద్ర వేశారని, అలాంటి వ్యక్తిని ఈ అవార్డు వరించడం చాలా సంతోషంగా ఉందని రమేష్ వెల్లడించారు.

### 21న ఉచిత కంటి వైద్యశిబిరం

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ నెల 21న ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్‌ఓ పాష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేత్ర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### నేడు బీఆర్‌ఎస్వీ కార్యకర్తల సమావేశం

ఇబ్రహీంపట్నం: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం నిర్వహించే బీఆర్‌ఎస్వీ కార్యకర్తల సమావేశానికి తరలిరావాలని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్ పిలుపునిచ్చారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ సమీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. బొంగులూరు గేట్ వద్దకు ఉదయం 9 గంటల వరకు బీఆర్‌ఎస్వీ నేతలు, కార్యకర్తలు చేరుకుంటే, అక్కడి నుంచి కలిసికట్టుగా తెలంగాణ భవన్‌కు తరలివెళ్దామని పేర్కొన్నారు.

### పేదలకు అండగా కాంగ్రెస్


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల: పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల నాయకుడు కొర్ర పాండు నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధి బోడకొండ గ్రామంలో పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధి కింద జాటోత్ మౌనికకు రూ.76వేలు, కొర్ర లక్ష్మానాయక్‌కు రూ.38వేలు, ఓరిగంటి సత్తయ్యకు రూ.20వేలు, దోసోత్ రవికి రూ.28 వేలు, జాటోత్ రవి కుమార్ రూ.78 వేలు, జాటోత్ దశరథ రూ.40వేలు, జాటోత్ అరవింద్ కుమార్ రూ.20వేల చొప్పున మంజూరైన చెక్కులను ఆయా బాధితులకు అందజేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బాలు నాయక్, దేవరాం నాయక్, లచ్చిరాం నాయక్, శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

### టీచర్‌కు సన్మానం


వందనను సన్మానిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని హర్షగూడ గ్రామానికి చెందిన మేఘావత్ వందన ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ ఫలితాల్లో టీచర్ ఉదోగ్యం సాధించింది. దీంతో బుధవారం ఆ గ్రామ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఇదే గ్రామంలో ఎంబీబీఎస్‌లో సీటు పొందిన మూడావత్ అఖిలను సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు వి.రాజునాయక్, ప్రధాన కార్యదర్శి దేవేందర్, లాల్‌సింగ్, కుమార్, మహేశ్, శ్రీను పాల్గొన్నారు.

# రహదారులు ఇలా.. వెళ్లేదెలా?

**అసంపూర్తిగా వంతెనల నిర్మాణం**
- రోడ్ల విస్తరణ పట్ల నిర్లక్ష్యం
- ప్రమాదాలు జరుగుతున్నా.. పట్టించుకోని అధికారులు, పాలకులు


వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేస్తున్న బీజేవైఎం నాయకులు (ఫైల్)

తలకొండపల్లి: తొమ్మిదేళ్ల క్రితం చేపట్టిన వంతెనల నిర్మాణం పనులు నేటికీ నత్తనడకనే కొనసాగుతున్నాయి. లక్ష్యం ఐదు బ్రిడ్జీల నిర్మాణం, రోడ్డు విస్తరణ. అందుకు తగిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం నాడే మంజూరు చేసింది. కానీ.. పనులు మాత్రం ఎక్కడవేసిన గొంగడి అక్కడేనన్న చందంగా కొనసాగుతున్నాయని ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు పలుమార్లు ఆందోళన చేసినా.. సంబంధిత అధికారుల్లో చలనం రావడం లేదని వాపోతున్నారు.

**నిధులున్నా నిర్లక్ష్యం**

తలకొండపల్లి మండల కేంద్రం నుంచి మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రం వరకు 19 కిమీ దూరం డబుల్ రోడ్డు బీటీ నిర్మాణానికి 2016లో అప్పటి ప్రభుత్వం రూ.22.50 కోట్లు, దాంతో పాటే తలకొండపల్లి, చంద్రధన, వెల్జాల్ గ్రామీణ ప్రాంతాల్లో 5 వంతెనల(కల్వర్టుల) నిర్మాణం కోసం మరో రూ.5.50 కోట్లను మంజూరు చేసింది. దీంతో మండల కేంద్రం నుంచి మండల పరిధి వెల్జాల్ శివారు ప్రాంతం వరకు సుమారు 14 కిమీ మేర బీటీరోడ్డును రెండు వరుసల నిర్మాణం పూర్తి చేశారు. రూ.3.81 కోట్లతో 4 వంతెనలను పూర్తి చేశారు. కానీ వంతెనల వద్ద రోడ్డు విస్తరణను విస్మరించారు. చంద్రధనలో నల్ల చెరువు సమీపంలో బ్రిడ్జి నిర్మాణానికి రోడ్డు వెడల్పు చేయలేదు. వాటి నిర్మాణం కోసం మంజూరు చేసిన నిధుల్లో రూ.5.50 కోట్లకు 3.81 కోట్లు ఖర్చు కాగా, రూ.1.69 కోట్లు మిగిలే ఉన్నాయి. ఆ డబ్బుతో మరో వంతెన నిర్మించాల్సి ఉంది.

**బురదమయం**

రోడ్డు విస్తరణ, అసంపూర్తి రోడ్లలో వాహనాల రాకపోలకు తీవ్ర ఆటంకం ఏర్పడిందని స్థానికులు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు బురదగా మారిన రోడ్డులో ఆటోలు, బైక్‌ల రాకపోకలకు కష్టంగా మారిందని పేర్కొంటున్నారు. ద్విచక్రవాహనదారులు కిందపడి గాయాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇదే విషయమై పలుమార్లు బీజేవైఎం నాయకులు ఆందోళనలు చేశారని, ఇటీవల ఆర్‌అండ్‌బి ఏఈ రవితేజ అసంపూర్తి నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని పరిశీలించారని, అయినా అసంపూర్తి నిర్మాణ పనుల గురించి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ప్రజా రవాణాను దృష్టిలో ఉంచుకుని, అధికారులు, పాలకులు రోడ్డు విస్తరణతో పాటు మిగిలిన వంతెన నిర్మాణ పనులను చేయించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

**కొత్త వంతెన నిర్మించాలి**



రహదారి విస్తరణలో భాగంగా చంద్రధనలో టెలిఫోన్ టవర్ వద్ద ఉన్న ఫీడర్ చానల్‌పై కొత్తగా వంతెన నిర్మించాలి. నల్ల చెరువు సమీపంలోని పురాతన బ్రిడ్జిని కూల్చివేయాలి. అదే ప్రదేశంలో నూతన వంతెన నిర్మించాలి.

–బక్కి కుమార్, మాజీ సర్పంచ్, చంద్రధన

**ప్రజారవాణాను మెరుగు పర్చాలి**



అసంపూర్తిగా మిగిలిన రోడ్డు విస్తరణ, బ్రిడ్జి నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేసి, ప్రజారవాణాను మెరుగు పర్చాలి. పలుమార్లు ఇదే విషయం నిరసన వ్యక్తంచేశాం. ఇప్పటికైనా ప్రజా రవాణాను దృష్టిలో ఉంచుకుని రోడ్డు మరమ్మతు, బ్రిడ్జిల పనులు పూర్తి చేయాలి.

– అనిల్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్, తలకొండపల్లి

**వారం రోజుల్లో పనులు**



అసంపూర్తి వంతెన నిర్మాణాలను ఇటీవల పరిశీలించాం. ప్రజల ఇబ్బందులను గమనించాం. మరో వారం రోజుల్లో రోడ్డు విస్తరణ, వంతెన నిర్మాణపు పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. ప్రజారవాణాను మెరుగు పరుస్తాం.

– రవితేజ, ఆర్ అండ్ బి ఏఈ, తలకొండపల్లి

# పశువుల పట్ల జాగ్రత్తలు తప్పనిసరి

- పశువైద్యాధికారి డాక్టర్ రేఖ
- మూగజీవాలకు గాలికుంటు నివారణ టీకా


పశువులకు టీకా వేస్తున్న డాక్టర్ రేఖ

యాచారం: పాడి, పశువుల ఆరోగ్యం పట్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ రేఖ సూచించారు. మండల పరిధి మొగుళ్లవంపు, మాల్ గ్రామాల్లో బుధవారం 23 మంది రైతులకు చెందిన 414 పాడి, పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ కోసం టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాడి, పశువుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని, అవి ఆరోగ్యంగా ఉంటేనే అధిక పాల ఉత్పత్తి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పశువులు అనారోగ్యానికి గురైతే పశువైద్యులను సంప్రదించాలని సూచించారు.

**ఆమనగల్లులో..**

ఆమనగల్లు: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడిపశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. పట్టణంలో 82 ఆవులు, 77 పాడి పశువులకు మండల పశు వైద్యాధికారి డా.అగ్నివేష్ ఆధ్వర్యంలో టీకా ఇచ్చారు. కార్యక్రమంలో పశువైద్యశాల సిబ్బంది యాదయ్య, సులేమాన్, బురానుద్దీన్, పాలాక్ష, గోపాలమిత్రలు హరీశ్, రమేశ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఉపాధ్యాయుడికి సన్మానం


టీచర్ రాఘవేందర్‌ను సన్మానిస్తున్న సీపీఎం నాయకులు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నియమితులైన ఉపాధ్యాయుడు రాఘవేందర్‌ను సీపీఎం నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. మండల పరిధి పడకల్‌కు చెందిన బట్టు పర్వతాలు, యాదమ్మ దంపతుల కుమారుడైన రాఘవేందర్‌కు కళ్లు సరిగా కనిపించవు. మొక్కవోని దీక్షతో బ్రెయిన్ లిపీలో చదివి, ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో టీచర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ప్రస్తుతం ఆయనకు తలకొండపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పోస్టింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా నేతలు టీచర్‌ను పడకల్‌లో సన్మానించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ నాయకులు దుబ్బ చెన్నయ్య, గ్రామ కార్యదర్శి శివగళ్ల రమేష్, సీఐటీయూ ఆమన్‌గల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య, మహిళా సంఘం నాయకురాలు రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గామాతకు ప్రత్యేక పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న నాయకులు

మహేశ్వరం: మండల పరిధిలోని కల్వకోల్ గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు చీకోటి ప్రవీణ్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్‌లు మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందువులందరూ ఐక్యంగా ఉండి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారు కోరారు. అనంతరం చీకోటి ప్రవీణ్, మహేందర్‌లను యూత్ సభ్యులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాసాని శ్రీనివాస్‌గౌడ్, కల్వకోల్ మాజీ సర్పంచ్ గాదె థామస్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు కాసాని వెంకటేశ్‌గౌడ్, కాసాని రమేశ్‌గౌడ్, ఎమ్మార్పీఎస్ నాయకులు బక్కని రవిమాదిగ, సభ్యులు, గ్రామస్తులు మల్లేశ్, రమేశ్, లక్ష్మణ్, నర్సింగ్‌రావు, మహిపాల్ పాల్గొన్నారు.

# నిధులు కేటాయించడం హర్షణీయం

- అభివృద్ధి చెందనున్న రహదారులు
- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి


మాట్లాడుతున్న పాండురంగారెడ్డి తదితరులు

కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో గ్రామీణ రహదారులు అభివృద్ధి చెందనున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అందుగుల సత్యనారాయణ అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 91 నియోజకవర్గాల్లో 641 పనులు చేపట్టడానికి 1,323 కిలో మీటర్ల మేర నూతన రహదారుల నిర్మాణం కోసం రూ.1377 కోట్లు మంజూరయ్యాయన్నారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో రోడ్ల విస్తరణకు మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ ప్రత్యేక చొరవతో రూ.17 కోట్లు కేటాయించారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి విషయమై ప్రభుత్వ పెద్దలను గతంలో కలిసి వినతి పత్రాలు అందించామన్నారు. ఫోర్త్ సిటీ, ఫార్మా, మెట్రోకారిడార్‌లతో నియోజకవర్గం మహానగరంగా మారుతున్న వేళ.. రోడ్ల విస్తరణకు నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు.

### నిస్వార్థ సేవతోనే సమాజంలో గుర్తింపు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీటీసీ కిషన్ రెడ్డి

మాడ్గుల: నిస్వార్థ సేవతో పాటు సమాజానికి ఏదో ఒకటి చేయాలన్న తపన ఉంటే ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని ఓయూ విశ్రాంత ఆచార్య డాక్టర్ మస్న చెన్నప్ప, మాజీ ఎంపీటీసీ కిషన్‌రెడ్డిలు అన్నారు. బుధవారం మండల పరిధి కోల్కులపల్లిలో వెంకట సుబ్బయ్య శర్మ స్మారకార్థం వారి కుమారులు సీతారాం శర్మ, రవి శర్మ ఆధ్వర్యంలో రూ.1.20 లక్షలతో నిర్మించిన కళావేదికను వారు ప్రారంభించారు. 'మానవతా మూర్తి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి కోసం వెంకట సుబ్బయ్య అహర్నిశలు శ్రమించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బట్టు అనురాధ, వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు నర్సిరెడ్డి, స్థానికులు భద్రయ్య, ప్రతాప్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, బాలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌కు సత్కారం

కందుకూరు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, కంబాలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, సురసాని వీరారెడ్డి, సింహారెడ్డి, రాంరెడ్డి, పన్నాల శ్రీకాంత్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, దూదిపల చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఛైర్‌పర్సన్‌కు..

తుక్కుగూడ: తుక్కుగూడ పురపాలక సంఘం ఛైర్‌పర్సన్‌గా ఇటీవల ఎన్నికైన బరిగెల హేమలతరాజుగౌడ్ దంపతులను బుధవారం మున్సిపాలిటీలోని శ్రీకంఠమహేశ్వరస్వామి ఆలయంలో గౌడ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఆలయంలో వారు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పురపాలక సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

తుక్కుగూడ: విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమతంగా ఉండాలని పహాడీషరీఫ్ ఎస్‌ఐ దయాకర్ సూచించారు. బుధవారం మున్సిపాలిటీలోని సీబీఆర్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ మోసగాళ్ల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొబైల్స్‌లో అవసరం లేని యాప్స్‌ను వినియోగించొద్దన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చింతల సింహారెడ్డి, పోలీస్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రూ.175 కోట్లతో అభివృద్ధి పనులు
- మరో రూ.200 కోట్ల పనులకు ప్రతిపాదనలు
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. రూ. వందల కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో తుర్కయంజాల్ పరిధిలో జరిగిన భూముల వేలం పాటలో సుమారు వెయ్యి కోట్ల వరకు ప్రభుత్వ ఖజానాకు నిధులు జమైతే.. వాటిని సిరిసిల్ల, సిద్దిపేట తదితర ప్రాంతాలకు తరలించుకుపోయారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత తుర్కయంజాల్‌కు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రికి విన్నవించడంతో రూ.175కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. మరో రూ.200 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు వెల్లడించారు. రోడ్లు, డ్రైనేజీ తదితర పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. అసంపూర్తిగా మిగిలిన పట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులకు నిధులు కేటాయించామని, త్వరలో పూర్తిచేసి, కళాశాలను ప్రారంభిస్తామని స్పష్టంచేశారు. తహసీల్దార్ భవన నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు.

# రాజ్యాంగ నిర్మాతకు అవమానం

- అంబేడ్కర్ విగ్రహానికి బురద చల్లిన వారిని శిక్షించాలి
- ప్రజా సంఘాల నేతల ఆందోళన
- క్షీరాభిషేకం చేసిన సీఐ, ఏసీపీ


అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఏసీపీ రాజు, సీఐ శంకర్‌కుమార్

యాచారం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై బురద చల్లిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్, ఎమ్మార్పీఎస్, రాజకీయ పక్షాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రంగారెడ్డి– నల్గొండ జిల్లాల సరిహద్దు మాల్ కూడలిలో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బురద చల్లారని, వెంటనే వారిని గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమాచారం అందుకున్న యాచారం సీఐ శంకర్‌నాయక్, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు మాల్‌కు చేరుకుని నిరసనకారులకు నచ్చచెప్పారు. బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఏసీపీ, సీఐలు అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకుల ఫిర్యాదు మేరకు పోలీసులు సాగర్, మర్రిగూడ రోడ్డుపై ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

# బీజేపీతోనే దేశ ప్రగతి

పార్టీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్


ఆన్‌లైన్‌లో సభ్యత్వాలు నమోదు చేయిస్తున్న పార్టీ శ్రేణులు

తలకొండపల్లి: బీజేపీతోనే దేశ ప్రగతి, అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి కుమార్ అన్నారు. పార్టీ చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని పేర్కొన్నారు. బుధవారం మండల పరిధి జూలపల్లి, చంద్రధన, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికీ తిరిగి సభ్యత్వాలను నమోదు చేయించారు. అనంతరం కుమార్ మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ పాలనకు యువత ఆకర్షితులై.. సభ్యత్వ నమోదుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని వెల్లడించారు. ఇప్పటి వరకు మండలంలో 4000కు పైగా సభ్యత్వ నమోదు చేశామని, 10 వేలకు పైగా నమోదు చేయనున్నామని వెల్లడించారు.

# ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం


నూతన సభ్యులతో యాదయ్య తదితరులు

తుర్కయంజాల్: ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు నిరంతరం పోరాటం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పగడాల యాదయ్య అన్నారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని చెప్పారు. బుధవారం కాలనీలో జరిగిన 6వ మహాసభల్లో నూతన కమిటీని నియమించామని ఆయన తెలిపారు. పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని నీలం సంజీవరెడ్డినగర్ నూతన శాఖ కార్యదర్శిగా జంగిలి ఆశీర్వాదం, సభ్యులుగా కొండిగారి శంకర్, నిమ్మ లక్ష్మయ్య, ఎన్.యాదగిరి, ఎం.చిన్నలను ఏకగ్రీవంగా ఎనుకున్నట్లు యాదయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మున్సిపాలిటీ బాధ్యుడు డి.కిషన్, నాయకులు ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల విస్తరణకు నిధులు మంజూరు

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు మండలంలోని పలు గ్రామాల రోడ్ల విస్తరణ, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ తెలిపారు. బుధవారం మున్సిపాలిటీలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ నుంచి సీఆర్ఆర్ కింద రూ.17కోట్ల నిధులు కేటాయించిందన్నారు. ఈ నిధుల్లో కందుకూరు నుంచి దెబ్బడగూడ వరకు రూ.2.5కోట్లు, కొనలగూడెం రోడ్డు విస్తరణకు 1.5కోట్లు, మందలకుంట తండా రోడ్డు విస్తరణకు రూ.8కోట్లు, గఫూర్‌నగర్ నుంచి జైత్వారం రోడ్డుకు రూ.4.5కోట్లు, మహేశ్వరం మండలంలోని ఎన్‌డీ తండా రోడ్డుకు రూ.50లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధుల నుంచి రోడ్ల విస్తరణ, బ్రిడ్జిల నిర్మాణ పనులు చేపడతామన్నారు. త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. గతంలో నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం, డిప్యూటీ సీఎం, జిల్లా ఇన్‌చార్జి మంత్రితో పాటు ఆయా శాఖల మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేశామన్నారు. వారు స్పందించి నిధులు మంజూరు చేసినందుకుగాను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్కకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ పాలనలో రోడ్లకు మహర్దశ


మాట్లాడుతున్న జంగారెడ్డి తదితరులు

పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి

కందుకూరు: కాంగ్రెస్ పాలనలో రోడ్లకు మహర్దశ పట్టనుందని పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని దెబ్బడగూడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కందుకూరు నుంచి దెబ్బడగూడ వరకు ఉన్న 2 కిలో మీటర్ల రహదారి గుంతలమయంగా మారి ఇబ్బందిగా ఉందని మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ ద్వారా మంత్రి సీతక్క, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, దీంతో వారి చొరవతో డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.2.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి సాధ్యమన్నారు. గత ప్రభుత్వాన్ని ఎన్నిసార్లు కోరినా ఫలితం లేదన్నారు. తమ గ్రామం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కతో పాటు కేఎల్ఆర్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ టి.జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు జంగయ్య, రవీందర్, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, దేవేందర్, బాలనర్సింహ, అంజయ్య, లక్ష్మయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.